# కాశీ పట్నం చూడర బాబు!

— అరణి

మా అగ్రహారం అందంగా ఉంటుంది. చిటపట చినుకుల్లో చలచల్లగా ఉంటుంది. లేలేత ఎండలో వెచ్చ వెచ్చగా ఉంటుంది. మంచుమబ్బుల్లో చలి చలిగా ఉంటుంది. అరవై గడపలతో అలరారుతోంది. ఆ వైపు నది, ఈ వైపు ఆలయం, అటు శ్మశానం, ఇటు మైదానం - చూడముచ్చ టనిపిస్తుంది !

చూడా లనిపిస్తోందా? రండి !

ఆ వైపు నది ఒడ్డున నిలిచి ఉంటే, ప్రతి అరగంటకీ అగ్రహారానికి పడవ ఉంది. పాత రోజుల్లో, పడవ ప్రయాణానికి పావలా తీసుకునేవాడు. ఈ కొత్త రోజుల్లో రూపాయి వసూలు చేస్తున్నాడు. "బేరసారాలు వద్దు. రూపాయి ఇచ్చి పడవలో కూర్చోండి." గడవాని పాట ఉచితంగా వినవస్తుంది. పాటంటే పాట కాదు, మాట పలకరింపుగా "ఎవ రింటికి బాబూ?" అనడుగుతా డు పడవవాడు. సమాధానంగా 'ఫలానా' వారింటికి అని చెబితే చాలు, జాలి జాలిగా ఆ కొననుంచి ఈ కొనమీది 'ఫలానా' వారింటి వేపు చూపు సారిస్తాడు.

"ఆరికి మీ రే టవుతా రు?" మళ్ళీ ప్రశ్నిస్తాడు. జవాబుగా 'బంధువు' అంటే బెదిరిపోతా డు. 'స్నేహితుడు' అంటే చల్లబడతా డు. ఈ రెండూ గాక, ఏదీ చెప్పలేక సంశయిస్తుంటే - "ఆరు మీకాడ అప్పు తీసుకున్నారా?" అనడుగుతా డు.

అవునని చెప్పనక్కరలేదు. అవునన్నట్టుగా కళ్ళార్పితే చాలు. వజవజా వణికిపోతా డు వాడు. విలవిల్లాడుతా డు.

"వందలా బాబూ?" అంటూనే "తీర్చేస్తారు బాబూ ! కాలూ, సెయ్యీ కూర్చుకుని, తీర్చేస్తారు" అంటాడు. కాదన్నట్టుగా చూస్తే - "ఏలా బాబూ ! పావం, పిల్ల పెళ్ళికో, తల్లి జబ్బుకో, పిల్లాడి సదువుకో సేనుంటాడు. దరమ పెబువులు కనికరించాలి. కాసింత ఎసులుబాటు సెయ్యాలి. తీర్చేస్తారు బాబూ. తా తల కాణ్ణించి నూత్తన్నాను. ఆల్లక్కడే ఉంతున్నారు. ఎవ లెక్కడికీ ఎలిపోరు. ఈ గడ్డని, ఈ నీటిని, కానుకునున్న నీతినీ కాదనుకుని పారిపోరు బాబూ. నా మాట నమ్మండి. గడమీద పెమానకం సేసి సెబుతున్నాను, రేపో, ఎల్లుండో, అత్తల్నాడో అణా పైనల్తో అప్పంతా తీర్చేస్తారు. ఎల్లండ్రి బాబూ. గడటియ్యనా?" అంటాడు.

పడవ దిశ మార్చే ప్రయత్నం చేస్తాడు. కూడదంటే కాళ్ళా వేళ్ళా పడతా డు. కన్నీళ్ళు పెడతా డు. మొండికేస్తే తనూ మొండికేస్తాడు. నట్టనడి నదిలో పడవను నిలిపి, గడను ఎత్తివేస్తాడు. ప్రాణాలను అరచేతిలో నుంచుకో మంటాడు. అగ్రహారీకులతో అంతటి అనుబంధం వాడిది.

"రాజాల్లా బతికినారు. అడిగింది లేదని ఎరగరు. ఊరగాయ ముక్కడిగితే ఊరంత సంతర్పణ సేసీవోరు. ఇంత తిని, అంతా అందరికీ పెట్టే జనం. సివరాకరికి ఇది గిలాగయిపోయారు. కాలం మా సెడ్డది బాబూ. 'కళ్ళముందే కతలన్నీ నడిపిస్తాది" అని గోలుగోలున విలపించే, వినిపించే గడవాడి మాటలు విని, చేష్టలు కని అగ్రహారానికి తరలివచ్చే షావుకార్లంతా తిరుగు ప్రయాణమవాల్సిందే, మరో దిక్కు లేదు !

అగ్రహారాన అడుగిడితే, తొలిగా లచ్చమ్మగారి దేవిడీ కనిపిస్తుంది. మూడు దశాబ్దాల క్రితం ఆ దేవిడీ రాజమహల్లా ఉండేది. అక్కడ వాకిలిన వేలాడదీసిన వేయొత్తుల దీపం, రాత్రివూట సూర్యునిలా నిలిచి ఉండేది. పగటిపూట తెలివేళ చంద్రునిలా వెల వెలబోతూ కనిపించేది. కొబ్బరిచెట్లు, మామిడి చెట్ల నడుమ లచ్చమ్మగారు, తల చెడిన రాణిలా ఉండేవారు. చిన్న వయసునే భర్త చనిపోవడంతో దేవిడీ ఆమె పేర ప్రచారమయింది.


ఆ రోజుల్లో లచ్చమ్మగారిని దర్శించాలంటే, దేవిడీలోనికి సుమారుగా వంద అడుగుల దూరం నడవాల్సి ఉండేది. గంటలకి గంటలు వేచి చూడాల్సి ఉండేది. ఇప్పు డా అవసరం లేదు. చూడాలనుకుంటే, పిలిస్తే చాలు పలుకుతుం దామె. వెనుక దేవిడీ అంతా తనఖా పాలవడంతో ముందు గదిలో ముడుచుక్కూర్చుంటోంది.


తరువాత ఎవరెవరివో ఇళ్ళు కనిపిస్తాయి. కూలిన గోడలు, గోడల, నడుమనుండీ మొలకెత్తిన, రావి మొక్కలు, మర్రి రెమ్మలతో ఆ ఇళ్ళు శిథిలమైన అంతఃపుర భవనాల్లా అగుపిస్తాయి. చివరికంటా అదే వరుసలో వెళ్తే శాస్త్రిగారి పెంకుటిల్లు కనిపిస్తుంది. చెదిరిన పెంకులతో, చీలికయిన వస్త్రంలా ఉంటుం దది. దాన్ని చుట్టుకుని ఆ ఇంట ఆరుగురు నివసిస్తున్నారు.

శాస్త్రిగారు చనిపోయి చాలా యేళ్ళయింది. ఆయన భార్య శేదమ్మ. ఇద్దరు కొడుకులు, మనవడు, కోడళ్ళతో బ్రతుకును బలిపీఠం చేసుకుంటోంది. ఏభైయేళ్ళ వయసుంటుం దామెకి. మొన్ననే చిన్న కొడుకు దీక్షితులుకి పెళ్ళి చేసింది. పెళ్ళయి పదహారు రోజులు కూడా కాలేదు.

పదహారు రోజుల పండుగ రెండు రోజుల్లో జరగనుంది. వేసిన పందిరిని తొలగించలేదు. తోరణాలను తీయలేదు. రోజు కో ముచ్చటను జరిపిస్తూ, కోడలు మహాలక్ష్మిని మచ్చిక చేసుకుంటోం దామె.

ఆ రోజు - కొత్త బిందెతో, కొత్త కాపురానికి, కొత్త కోడలితో నీళ్ళు తెప్పించనున్నారు. ఆ ఉత్సవానికి అగ్రహారాన ముత్తయిదువులంతా హాజరయ్యారు. మంచినీటి రేవుకి మహాలక్ష్మితో పయనమవాల్సి ఉంది. మడి, తడి బట్టల్లో సిద్ధమై ఉన్నా రంతా.






పసుపు పెట్టిన కొత్త బిందెను చంక నెత్తుకుని, మహాలక్ష్మి గడప ఇవతల అడుగిడిందో, లేదో గుమ్మం ముందు నిలిచిన జట్కాను చూసి అడుగు తడబడింది. ఎవరయి ఉంటారు? ఉత్సుకతతో చూసింది.

డేయిసా లాంటి వ్యక్తి జట్కాలోంచి దిగాడు. దేహంలోని ఏ ఒక్క భాగమూ విడిగా ఉన్నట్టు లేదు. అన్నీ కలసిపోయున్నాయి. మాంసం ముద్దల్ని ఒకదాని మీదొకడి పేర్చినట్టుగా ఉంది అతని వాలకం.

"రండి బాబూ ! రండి !" అంది శోదమ్మ. రెండడుగులు ముందుకు నడిచి, అతని చేతిలోని బ్రీఫ్‌కేస్‌ను అందుకుంది. ముత్తయిదువులంతా ముఖముఖాలు చూసుకున్నారు. ఇరు పక్కలకీ తప్పుకుని ద్వారం దగ్గర దారి చేశారు.

"పెళ్ళికి వస్తా రనుకున్నాం. ఏ పని పడిందో రాలేకపోయారు" అంది. కొత్త కోడలు చేయందుకుని - "మహాలక్ష్మి ! దీక్షితులు భార్య" అని, అతనికి పరిచయం చేసింది. కోడలు చేతిలోని కొత్త బిందెను అందుకుంది. మహాలక్ష్మి అతనికి పాదాభివందనం చేసింది.

"గోపాలబాబని మనకి బాగా కావాల్సినవారు. పట్నంలో ఉంటున్నారు" అంది శోదమ్మ. "మీ మామగారి స్నేహితులు" అంది.

మహాలక్ష్మి నవ్వుతూ నిల్చుని ఉంది.

ముత్తదువులంత అసహనంగా వేచి చూస్తున్నారు. మూతులు విరుచుకుంటున్నారు.

"రా తల్లీ రా ! అవతల బోలెడు పను లున్నాయి" అన్నా రెవరో. మహాలక్ష్మి అటు నడిచింది.

అగ్రహారంలో గాపాలబాబుని చూడా లనుకుంటే, అన్ని కాలాల్లోనూ లభ్యమవడు. మండువేసవిలో, ఏప్రిల్-మే నేలల్లోను, నిండు చలిలో నవంబరు - డిసెంబరు మాసాల్లోను మాత్రమే దర్శన మిస్తాడు. అతని స్వస్థలం అగ్రహారం కాదు. అత్తగారి ఊరు అంతకన్నా కాదు. మరి? నగానికి నగం అగ్రహారాన్ని అతను తనఖా పట్టాడు. అగ్రహారానికి అయిదు వందల కిలోమీటర్ల దూరంలో, ఓ ప్రముఖ పట్టణంలో నివసిస్తూ, బాకీలు వసూలు చేసుకునేందుకు అగ్రహారానికి వస్తుంటాడు.

గోపాలబాబుకి ఏభైయేళ్ళ వయసు ఉంటుంది. అతనికి ఇరవై అయిదేళ్ళ వయసు ఉన్నప్పుడు ఒకానొక రాత్రి శాస్త్రిగారు పట్టణంలో ఉంటూన్న అత నింటికి వెళ్ళారు. ఆ మాటా ఈ మాటా కాసేపు చెప్పి, అసలు విషయాన్ని ప్రస్తావించారు.

"అగ్రహారం, దాని చుట్టుపక్కల గల అయిదూళ్ళ పౌరోహిత్యాన్ని హక్కుదారుడు సుబ్బారావు అమ్మకానికి పెట్టాడు. అయిదు వందలని ఖరీదు చెబుతున్నాడు. అతను చూసీ చూడక ఉంటున్నందువల్ల హక్కు లేకున్నా అరకొరా పురోహితం చేసుకుని ఇన్నాళ్ళూ నెట్టుకొచ్చాను. ఇప్పుడు దాన్ని ఎవరు కొనుగోలు చేసినా, పాత్తర కూడా న న్నెత్తనివ్వరు. భార్య, ఇద్దరు పిల్లలు గలవాణ్ణి. ముమ్ముందు కష్టాల నెదుర్కోవాల్సి వస్తుంది. పురోహితాన్ని నేనే కొనగలిగితే కష్టా లుండవు. అందుకు మీ సహాయం కావాలి. అయిదు వందల రూపాయలు మీరు అప్పివ్వగలిగితే, నా వంశమంతా మీకు రుణపడి ఉంటుంది. కాదనకండి. బ్రాహ్మణుణ్ణి చేయి చాచి 'దేహీ' అంటున్నాను. పుణ్యం, పురుషార్థం దక్కుతాయి. నా కీ ఒక్క సహాయమూ చేయండి. మీ మొత్తం త్వరలోనే తీర్చేస్తాను ! వడ్డీ కూడా చెప్పండి. నెల నెలా కడతాను. కాదంటే, కదలనుగాక కదలను" అన్నారు.

"దాందేముంది లెండి !" అని వందకి నెలకు 'ఇంత' వడ్డీ అని చెప్పి, అయిదు వందలు అప్పు ఇచ్చి, అవసరానికి శాస్త్రిగారిని గోపాలబాబు ఆదుకున్నాడు. సంవత్సరం గడిచింది. ఈలోపు అసలూ లేక వడ్డీ రాకపోయేసరికి స్వయంగా గోపాలబాబే అగ్రహారానికి ప్రయాణమయ్యాడు. శాస్త్రిగారిని కలసి విషయం తేటతెల్లం చేయమన్నాడు.

"కలసిరాకనే మిమ్మల్ని కలవలేకపోయాను" అన్నారు శాస్త్రిగారు. క్షమించమని చేతులు నులుముకున్నారు. "వచ్చింది వచ్చినట్టుగా సరిపోతోంది. పొదుపు చేసే అవకాశం లేకపోతోంది. రేపటి నవంబరులో రానున్నది కార్తీక మాసం. ఎవరే దానధర్మాలు చేసినా, ఆ మాసంలోనే చేస్తారు. ఏ ఇద్దరు గోదానాలు చేసినా మీ సొమ్ము పువ్వుల్లో పెట్టి తీరుస్తాను. లేకుంటే, కాణీ పరకా పోగుజేసి, అప్పటివరకూ అయిన వడ్డీనయినా కడతాను, నమ్మండి" అన్నారు.

"అవి ఉత్త మాటలులెండి. మాటిచ్చి నిలబెట్టుకోకపోవడం మంచి పద్ధతి కాదు. ఏప్రిల్-మే నెలల్లో పుష్కలంగా పెళ్ళి ముహూర్తా లున్నాయి. అదృష్టం కలిసొచ్చి పది, పన్నెండు పెళ్ళిళ్ళు జరిపించగలిగితే వడ్డీతో పాటు మీ అసలంతా తీర్చేయగలం. అంతవరకూ తమరు కొంచెం ఓర్పు వహించాలి" అన్నది శోదమ్మ. వచ్చి భర్త పక్కగా నిల్చుంది.

గోపాలబాబు ఆమెను నిండుగా చూశాడు. "ఎవరు?" అనడిగాడు.

"నా భార్య" అన్నారు శాస్త్రిగారు.

"ఆమె మాటమీద నమ్మకముంచి వెళ్తున్నాను" అన్నాడు గోపాలబాబు. వెళ్తూ "వెళ్ళొస్తాను" అన్నాడు.

నవంబరు-డిసెంబరు నెలలే కాదు, ఏప్రిల్-మే నెలలు కూడా శాస్త్రిగారిని అయిదారు వందల రూపాయల ఆస్తిపరుణ్ణి చేయలేకపోయాయి. కనీసం,

ఉదయం ప్రశాంత శీతల రాగాలు
వాటి నీడలలో బీభత్సం హేళన చేస్తోంది
కాలం ద్విముఖ పాత్రధారిలా
జీవిత రంగస్థలంపై నటిస్తోంది
ఆశ నిరాశల సాలెగూడుల్లో
మనిషి చిక్కుకుని మరణిస్తున్నాడు

★ ★ ★

అనంత భూగోళ ప్రాణవాయువు పరిధుల్లో
కాలుష్యం విషజ్వాలలు ప్రసరిస్తున్నాయి
కనుచూపుమేరలో, దశాబ్దం దూరంలో
కాలుడు మృత్యు గదాయుధంతో గర్జిస్తున్నాడు

★ ★ ★

భూమి కుంచించి, సముద్రుడు జయించి
నేల నాల్గుచెరగుల రేఖలు మారేనా?
మారుమూల నేలకూపంలో కదిలిన ప్రాణి
అనంత వాయువుల్లో మిణుగురు పురుగౌతుందా?
వేల కోట్ల మిణుగురుల కాంతులు
విశ్వజ్యోతులతో ఎదురీదేనా?
ఈ అనంత జ్యోతుల మహాసముద్రంలోని
కెరటాలలో తేలే ఓ వెలుగుచుక్క మనిషి.

-పోతుకూచి సాంబశివరావు

## మొదటిది

తమ రెండవ పెళ్ళి రోజు సందర్భంగా భార్యతో కలిసి కులాసాగా తిరుగుతున్న రాజేష్, కొన్త దూరం వెళ్ళాక "ఏమోయ్! నీకు మరో ఐస్‌క్రీం కొనిపెట్టనా?" అని అడిగాడు తన ముద్దుల భార్యను. "మరొకటా? మొదటిది ఎప్పుడు కొనిపెట్టారు?" ఆశ్చర్యం ప్రకటించింది భార్యామణి.

"కిందటి మేరేజ్ డేకు కొనిపెట్టాను కదోయ్!" గుర్తు చేశాడు రాజేష్.



టి. సంపత్‌రావు

వడ్డీ కట్టేందుకు కూడా వెసులుబాటు కాకపోవడంతో, గోపాలబాబును ఆయన మరచిపోవాల్సివచ్చింది. అయితే గోపాలబాబు శాస్త్రిగారిని, వారి భార్య శోదమ్మను మాత్రం మరచిపోలేకపోయాడు.

శాస్త్రిగారు చీపురుపుల్లలా సన్నగా ఉంటారు. ఊపిరిలేని వ్యక్తిలా ఊగిపోతూ ఉంటారు. శోదమ్మ అందుకు విరుద్ధంగా ఉంటుంది. అందంగా ఉంటుంది. అంతలేసి జబ్బలతో, ఇంతలేసి కళ్ళతో వింత వింతగా ఉంటుంది. ఆమెలో గల ఆ వింతదనమే గోపాలబాబును బాగా ఆకర్షించింది. ఆమెమీద మనసుపడ్డా డతను. అందుకే మరచిపోలేక, హఠాత్తుగా ఓ రాత్రివేళ అగ్రహారంలో ఊడిపడ్డాడు.

గోపాలబాబును చూసిన శాస్త్రిగారికి కరచరణాలాడలేదు. కళ్ళలో నీళ్ళాడక తప్పలేదు.

"వేళగాని వేళలో వచ్చారు ! ఈ పేదవాడు ఏమిచ్చుకోగలడు?" అన్నారు శాస్త్రిగారు. చేతులు కట్టుకుని నిల్చున్నారు.

"ముందుగా ఓ గ్లాసుడు మంచినీ ళ్ళివ్వండి" అన్నాడు గోపాలబాబు. అలా అడగడంలో అతను శోదమ్మ రాకను ఆశించాడు. ఫలించింది. శోదమ్మ కంచెంబుతో నీ ళ్ళందించిం దతనికి. నీళ్ళతో పాటు శోదమ్మను కూడా తాగేసి - "కష్టాలు ఎప్పుడూ ఉండేవే ! కాదనను. కాకపోతే చేసిన అప్పును తీర్చక హాయిగా నిద్రపోతా నంటే ఎలా? మీరే చెప్పండి. వడ్డీతో సహా సుమారుగా వెయ్యి రూపాయలు మీవద్దే నిలవుండిపోతే నా వ్యాపారం సాగేదెలా? ఆలోచించండి. మీరు పౌరోహిత్యం చేస్తున్నారు, నేను వ్యాపారం చేస్తున్నాను. ఇద్దరికీ అంతే తేడా" అన్నాడు గోపాలబాబు. చేతులు పైకెత్తి ఒళ్ళు విరుచుకున్నాడు.

"చాలా దూరంనుంచి వచ్చారు. ఇంత రాత్రివేళ మళ్ళీ ఎక్కడికని వెళ్తారు? ఇక్కడే విశ్రమించండి" అన్నారు శాస్త్రిగారు. మాట తప్పించి, గోపాలబాబు వద్ద మంచితనం సాధించా లనుకున్నా రాయన.

"కాదంటానా?" అని చల్లబడ్డాడు. అతను కోరుకున్నదీ అదే ! నట్టింట్లో పడక సిద్ధంచేస్తే గోపాలబాబు పవళించాడు. శాస్త్రిగారు, శోదమ్మ, ఇద్దరి పిల్లలూ అటు పక్క గదిలో నిద్రపోయారు.

ఓ జాము గడిచింది.

శోదమ్మకు మెలకువ వచ్చింది. బాగా దాహంగా ఉం దామెకు. అలవాటులేక, గదిలో నీళ్ళ చెంబు నుంచుకోవడం మరచిపోయింది. తప్పదు నట్టింట్లోకి వెళ్ళి నీళ్ళు తా గాల్సిందే ననుకుంది. అడుగులో అడుగుగా మెల్ల మెల్లగా నట్టింట అడుగిడిం దామె. నీళ్ళ చెంబును అందివుచ్చుకుని, ఎత్తిపట్టి తాగనుందో లేదో - గోపాలబాబు ఆమెను అల్లుకున్నాడు.

శోదమ్మ చేష్టలుడిగింది. కేక వేద్దామన్నా నోరు పెగల్లే దామెకు. పిచ్చిచూపులు చూసింది. అయోమయంలో అయిదు నిముషాలు చచ్చిపోయిం దామె. తరువాత తేరుకుంది. జరిగింది తలచుకుని విలపించసాగింది.

"ఏడవకు ! వడ్డీ చెల్లించనవసరం లేదులే" అన్నాడు గోపాలబాబు. "వెళ్ళు ! వెళ్ళు" అని సాగనంపాడు. అది మొదలు శాస్త్రిగారు చేసిన అప్పును తీర్చమని గోపాలబాబు ఆయన్ని ఏనాడూ ఒత్తిడి చేయలేదు. అసలు సలా ఉంచి వడ్డీకోసం మాత్రం మండు వేసవిలోనూ, నిండు చలిలోనూ వచ్చి వెళ్ళడం అలవాటు చేసుకున్నాడు. శోదమ్మను స్వాధీనం చేసుకున్నాడు.

పెద్దవాడు సోమయాజులుకి పెళ్ళయిన ఆర్నెళ్ళకి శాస్త్రిగారు చనిపోయారు. నాటినుండి తండ్రి బాధ్యతలని సోమయాజులు స్వీకరించడమే గాక గోపాలబాబు రాకపోకలను కూడా తప్పనిసరిగా భరించాల్సి వచ్చిం దతనికి. శోదమ్మంటే మొహంమొత్తిన గోపాలబాబు కన్ను ఇంటి పెద్ద కోడలుమీద మోజు పడింది.

"నా జీవితాన్ని నాశనం చేశారు, చాలదా? అప్పు తీరదా?" అని శోదమ్మ శోకిస్తే - "అలాగెలాగ? అలా కుదరదు" అన్నాడు గోపాలబాబు. కోడలు కౌసల్యను తన కౌగిలిలోనికి పంపాల్సిన బాధ్యతను అత్తగారు శోదమ్మకి అప్పగించాడు.

కొడుకు దగ్గర అంతా చెప్పుకుని రోదించింది శోదమ్మ. "మరో దిక్కు లేదురా. మరోలా బ్రతకలేంరా" అని విలపించింది. నిజానికీ అంతే ! పదేళ్ళకి ఉపనయనం జరగడంతో, చదువుకి స్వస్తి చెప్పి, తండ్రి వెంట పౌరోహిత్యానికి పరుగుదీసే సోమయాజులుకి తెగించి మరో వృత్తిని చేపట్టే ధైర్యమూ లేదు.


"కౌసల్యకి చెప్పి చూస్తాను" అన్నాడు. నయానా, భయానా చెప్పి, ఆఖరికి భార్యను ఒప్పించాడు సోమయాజులు.

"ఈ ముద్దూ ముచ్చటంతా వడ్డీదే ! అసలు సంగతింకా అలాగే ఉంది" అన్నాడు గోపాలబాబు కౌసల్యతో. కిక్కురుమనలే దా పిల్ల. కన్నీళ్ళను కడుపులో దాచే ప్రయత్నంగా కళ్ళు మూసుకుందంతే. కొన్నాళ్ళకి గర్భవతి అయింది. పండంటి బిడ్డణ్ణి ప్రసవించింది. ప్రసవ సమయంలో కౌసల్య నానాబాధా పడింది. చావు కల కాచింది. అక్కణ్ణుంచి అనారోగ్యమే అనారోగ్యం. కూర్చుంటే నిలుచోలేదు, నిలుచుంటే కూర్చోలేదు. ఆ పరిస్థితుల్లో అగ్రహారానికి గోపాలబాబు రాకపోకలు సన్నగిల్లాయి. మళ్ళీ నాటికి నేడు వచ్చా డతను. "ఏం కొత్తపెళ్ళికొడకా?" అని దీక్షితుల్ని పలకరించి, నట్టింట తిష్ఠవేశాడు.

మహలక్ష్మి మంచినీళ్ళ బిందెతో తిరిగొచ్చింది. నట్టింట కుదురుమీద బిందె నుంచి, ఇంట్లోని నలుగురికోసమూ కలయజూసింది. ఎవరూ కనిపించలేదు. గో[illegible] మాత్రం పందిరి పట్టెమంచంమీద గుర్రుపెట్టి నిద్రిస్తున్నాడు. పరుగు పరుగున పెరట్లోనికి వెళ్ళి చూసింది. బాదంచెట్టు నీడలో అత్తగారు, బావగారూ కూర్చునుంటే, భర్త చెట్టు నానుకుని నిల్చునుండడం కనిపించింది. అంతా ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు.

చేతులు కట్టుకుని, తల దించుకుని నిల్చున్న దీక్షితులు వేపు తదేకంగా చూస్తున్నారు సోమయాజులు, శోదమ్మ.


"పడుపు కూడు తినిపించే మీ ఇద్దర్నీ పెంచి పెద్ద చేశానర్రా. పౌరోహిత్యం అచ్చొస్తుం దనుకున్నా రాయన. చేతినిండా గడించేసి, మేడలు, మిద్దెలూ కట్టిద్దా మనుకున్నారో, ఏమో ! అయిదూళ్ళ పురోహితాన్ని అప్పు చేసి మరీ కొన్నారు. కొన్న తరువాత తెలిసివచ్చింది ఇది బంజరుభూమి అని. అప్పటికే చేతులు కాలిపోయాయి. అయితే చచ్చి ఏ లోకాన ఉన్నారో ఏమో మీ నాన్న ! ఆ మహానుభావుడికి మాత్రం నేను మైలపడ్డానన్న విషయం తెలియదు. గోపాలబాబు వడ్డీని వద్దంటున్నాడంటే, అసలు కూడా అడగడం లేదంటే గొప్పవా డనుకున్నారు. ఆ నమ్మకంతోనే ఆనాడు అప్పున్నానని నోటు



రాసిమ్మంటే. గోపాలబాబుకి రాసిచ్చేశారు కూడా. ఇప్పు డది తడిసి మోపిడై కూర్చునుంటుంది. అడిగింది కాదన్నామనుకో, వడ్డీతో సహా అన లంతటినీ గోపాలబాబు కక్కమంటాడు. ఎక్కణ్ణుంచి తెస్తాం? నువ్వే చెప్పు. ఆ రోజుల్లో అన్నయ్య కూడా నీలాగే 'చావనైనా చస్తాను గాని, ఇందుకు నే నొప్పుకోను' అనుంటే ఈనాటికి మనతీరు ఇలా ఉండేది కాదు. చెట్టు కొకరు పుట్ట కొకరుగా చెదరి ఉండేవాళ్ళం. మీ వదినో మహాతల్లి. కాపురాన్ని నిలబెట్టింది. కాని, కర్మ ఇలా కాలుతుందని ఊహించామా? అది జబ్బు మనిషయిపోవడంతో ఈ ప్రమాదం ఇలా వచ్చిపడింది. చెప్పవలసిందంతా చెప్పాను. ఇంటయిదుగురి బ్రతుకులూ నీ చేతిలో ఉంచాం. బ్రతకనిస్తావో, చంపేస్తావో నీ ఇష్టం ! కాదంటావా, కలివిడిగా వెళ్ళి అందరం నదిలో దూకేద్దాం. అవునంటావా, మా అయిదుగురికీ ఇంత అన్నం పెట్టిన వాడవవుతావు ! ఆలోచించు'' అన్నది శోదమ్మ.

అరగంట క్రితం ఎంతగానో ఉద్రేకపడిన దీక్షితులు, ఇప్పుడు ఉద్రేకాన్నణచుకుని, సుదీర్ఘంగా ఆలోచించనారంభించాడు. తల్లి మాటలు అతన్ని నిస్సహాయుణ్ణీ, నిర్లజ్జితుణ్ణీ చేశాయి.

అన్నయ్యే నయం ! ఉపనయనం జరిగేవరకు కనీసం సెకెండ్ ఫారమ్ వరకయినా చదువును వెలగబెట్టాడు. తను, అంతవరకూ కూడా చదువుకోలేదు. అరటిపళ్ళ నాశించి తండ్రితో సత్యనారాయణ వ్రతాన్ని జరిపేందుకు వెళ్ళడంలోనూ, మామిడిపళ్ళ నాశించి తల్లితో ముత్తయిదువు




నోములకు వెళ్ళడంలోనూ సరదా పడ్డాడేగాని, చదువు పట్ల శ్రద్ధ చూపలేకపోయాడు. ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాను అనుకున్నాడు దీక్షితులు. తండ్రిమీద, ఆ తండ్రి ప్రసాదించిన వృత్తిమీద తొలిసారిగా అతనికి అసహ్యం కలిగింది. అప్పును తీర్చలేకపోవడంతో అమ్మా, వదిన గోపాలబాబు వశమవడంలో ఇంటి ఇద్ద రాడవాళ్ళనీ తలచి భోరుభోరున దుఃఖించా డతను.

స్పష్టాస్పష్టంగా వినవచ్చిన ఆ మాటల్లోని అంతరార్థం ఏమీ బోధపడలేదు మహాలక్ష్మికి. దూరంలో ఉన్న ఆ ముగ్గురి దగ్గరికీ మామూలుగా నడిచి వెళ్ళింది. ఆమె రాకను గమనించి, అక్కడి ముగ్గురూ మౌనం వహించారు.

ఆ మధ్యాహ్నం-

ఆలయం వెనుక ఏకాంతంగా గన్నేరు చెట్టునీడలో మెట్లమీద కూర్చున్నారు దీక్షితులు, మహాలక్ష్మి. రెండు మూడుసార్లు గొంతును తడి చేసుకున్నాడు దీక్షితులు. మహాలక్ష్మికి ఏదో చెప్పబోయే ప్రయత్నం చేశాడు. ధైర్యం చిక్కబట్టుకున్నాడు.

"మనింటికి వచ్చాడు చూడు, గోపాలబాబని ! వా డో వెధవ'' అన్నాడు ఆఖరికి. అని మహాలక్ష్మి ముఖంలోనికి చూడక, కథంతా చెప్పుకొచ్చాడు. తండ్రి చేసిన అప్పు చెప్పాడు. తల్లికి సంప్రాప్తించిన శాపం చెప్పాడు. వదినమ్మ దుఃఖం చెప్పాడు. చెప్పి చెప్పి ముంచుకురానున్న ప్రళయాన్ని మహాలక్ష్మి ముందుంచాడు.. లేచి నిల్చున్నాడు అతన్ని అనుసరించింది మహాలక్ష్మి.

"పీడకల అనుకో, దుర్ఘటన అనుకో. అయినవాళ్ళ కోసం అవసరమయిన పాపం చేశాననుకో. గోపాలబాబును కాదనకు'' అన్నాడు.

"మొగుడిగా, మగాడిగా నేను మాట్లాడడం లేదనొచ్చు. నామీద కోపం, అసహ్యం కలుగొచ్చు. తప్పేమీ లేదు. పరిస్థితి అటువంటిది'' అన్నాడు.

"గోపాలబాబుని హత్య చేయాలన్నంత కోపంగా ఉంది. కాని, వాణ్ణి హతమార్చినంత మాత్రాన సమస్య సమసిపోదు సరికదా, మరిన్ని సమస్యల పాలవుతాం. అందుకని...'' అన్నాడు.

మనిషి నిలువునా చీలిపోతూ తలెత్తి చూశాడు. మహాలక్ష్మి ఎదురుగా లేదు. ఉన్నది గడవాడు ! పడవ నడిపే వాడున్నా డెదురుగా ! వాణ్ణి చూసి అల్లకల్లోలమయ్యాడు దీక్షితులు.

"కంగారుపడకండి బాబూ ! ఈ గుడిలోనే కాను, మీ అందరి గుండెల్లోనూ తలదాచుకుంటున్నోణ్ణి. నావల్ల మీ కే ఆపదా రాదు. నమ్మండి'' అన్నాడు.

"మీరు సెప్పిన పనికి మా లచ్చుమ్మ కొంగు నోట కుక్కుకుని కుళ్ళి కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ లగెత్తుకుపోయింది. ఏ అగాయిత్యం చేసినా సెయొచ్చు. ఎళ్ళండి. బేగెళ్ళండి'' అన్నాడు.

'అగాయిత్యం' అన్న మాట గడవాడి నోటినుండి రాగానే, దీక్షితులు క్షణం నిలువలే దక్కడ. పరుగెత్తుకుని వెళ్ళిపోయాడు.

గడవాడి గుండె అంతా గుబులుతో నిండిపోయింది. ఎండవేళ, ఎంగిలిపడేందుకు ఆలయం వెనుకనున్న శిథిల మండపంలోనికి వచ్చాడు వాడు. పెళ్ళయిన కొత్త జంట, మహాలక్ష్మి దీక్షితుల్ని ఆవేళప్పుడు గన్నేరు చెట్టుకింద చూసి ఆశ్చర్యపోయాడు. ఆలయం మూసి ఉంటుంది. అర్చకుడు ఉండడు.

'ఇది గిప్పుడేటి ఈ ళ్ళిక్కడికొచ్చారు' అనుకున్నాడు. విషయం కనుక్కుందామని వెళ్ళి, వాళ్ళ వెనుకగా నిల్చున్నాడు. దీక్షితులు ప్రతి మాటనీ విన్నాడు వాడు. దిగులు చెందాడు. ఒకానొక సమయంలో మహాలక్ష్మి వాణ్ణి చూసింది. దుఃఖాన్ని ఉగ్గబట్టుకోలేక అక్కణ్ణుంచి పారిపోయింది. సగం చచ్చి, అవసరాన్నీ పరిస్థితినీ వివరించుకుపోవడంలో దీక్షితులు ఇదేదీ గమనించలేదు.

సాయంత్రం-

నది ఒడ్డుకు వచ్చాడు గోపాలబాబు. గడవాణ్ణి కేకేసి, అవతల గట్టుకు తనని చేర్చమన్నాడు. మళ్ళీ ఓ గంటలో తిరిగొద్దామన్నాడు. తోడుగా లచ్చుమ్మ ఉంది.

"ఏటమ్మా, మీరూ వస్తున్నారా?'' అడిగాడు గడవాడు.

రావట్లేదని తలతాటిస్తూ - "ఆడదాన్నో మగవాణ్ణో ఓ సలుసుని కని ఉంటే, ఇటు కూతుర్ని గాని, అటు కోడల్ని గాని శోదమ్మకి మల్లే మీకు అప్పగించి పబ్బం గడుపుకునేదాన్ని. కడుపున ఓ పండూ పండలేదు ! ఆయన పోయారు. లేకుంటే తొలిగా పెట్టిన రెండు గదుల తనఖాకి వడ్డీమీద వడ్డీగా వెనుక దేవిడీ అంతా మీ పాలపనిచ్చేదాన్నా? 'పేద వెధవముండని, ఉంటూన్న ముందు గదినయినా నాకు ఉండనీయవయ్యా' అన్నా వింటున్నారు కాదు'' అంది గోపాలబాబుని ఉద్దేశించి.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు ! వెళ్ళు వెళ్ళు'' చిన్నపిల్లని గసిరినట్టిగా లచ్చుమ్మను గసిరాడు గోపాలబాబు.


పడవ ముందుకు నడిచింది.

"ఏం నోరయ్యా దాన్ది? ఛీఛీ !'' అన్నాడు.

"ఆయమ్మది నోరు కాదు బాబూ ! కడుప్మంట'' అన్నాడు గడవాడు. పడవ దిశను మార్చాడు.

"సిన్నా సితకా షావుకార్లను అగ్రహారం గట్టుకు సేర్చక ఏడిపించేవోణ్ణి. నడి నదిలో గడ నెత్తేస్తానని బెదిరిస్తే, పేణ బయానికి నే సెప్పినట్టినేవోరు. మీరు సిన్నోరు కాదు. పెద్ద షావుకారు. పుట్టి బుద్దెరిగి మిమ్మల్నేనాడూ నేను బెదిరించనేలేదు. పాతికేళ్ళుగా మిమ్మల్నగ్రహారానికి సేరుస్తూనే వచ్చాను. కన్నీటి కతలెన్నో యిన్నాను. ఇన్నాళ్ళూ నే సేసిన పాపానికి ప్రాయశ్చిత్తం సేసీసుకుంటాను. మీరేటీ అనుకోకండి. మిమ్మల్ని సంపెత్తాను'' అన్నాడు గడవాడు.

ఆసరికి పడవ, నిండు నది నడిలో ఉంది. అన్నట్టుగానే వాడు గడనెత్తి




నీళ్ళలోనికి విసిరేశాడు. వణికిపోతున్న గోపాలబాబుని ఒడిసి పట్టుకుని నీళ్ళలోకి తోసేశాడు.

గోపాలబాబుని గడవాడు చంపాడన్న విషయం, మా అగ్రహారీకు లొక్కరికే తెలుసు. ఇప్పుడు మీకూ తెలుసు. నేరాన్ని దాచిపెట్టి, మేమంత గడవాణ్ణి కాపాడామని చెప్పడంలేదు. గుండేగల మనిషని, వాణ్ణి మా గుండె గుడుల్లో దాచుకున్నాం. తప్పంటారా?

మా అగ్రహారం అందంగా ఉంటుంది. చూడముచ్చటనిపిస్తుంది. చూడాలని ఉందా? రండి మరి ! ★